ఫార్మా సిటీ రైతులకు ఊరట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పచ్చటి పంట పొలాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న న్యాయపోరాటం ఫలించింది. రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూరు ప్రాంతాల్లో టిజిఐఐసి సేకరించిన సుమారు 5వేల ఎకరాల వివాదాస్పద భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైకోర్టు తీర్పుతో ఆ భూముల రైతులకు రైతుభరోసా, రైతు బీమా ,ఆ భూములకు బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం వచ్చింది. ఈ మేరకు హైకోర్టు ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. దీంతో ఫార్మా రైతులకు ఊరట కలిగింది. రంగారెడ్డి జిల్లాలోని యాచారం, కందుకూరు మండలాల పరిధిలో ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణలో భాగంగా 19333 ఎకరాల భూమి సేకరించింది. ఇందులో సుమారు 5 వేల ఎకరాలుకు సంబందించిన రైతులు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ సేకరణ చేపట్టాలని కోర్టును ఆశ్రయించారు. అయితే 2017 నుంచి రైతుల భూములను రెవెన్యూ అధికారులు నిషేధిత జాబితాలో పెట్టడంతో రైతులకు ప్రభుత్వ నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేవు... దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పిల్లల పెళ్లిలకు కూడా భూములు విక్రయించలేని పరిస్థితిలో రైతులు నానాతంటాలుపడాల్సి వచ్చింది. రైతుల పక్షాన అనేక ప్రజా సంఘాలు సూధీర్ఘ కాలంగా చేపడుతున్న పోరాట ఫలితంగా హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలు, రైతు భరోసా, రైతు బీమా, రైతు పంటల రుణాలు అందించాలని ఆదేశించింది. ప్రస్తుతం నిషేధిత జాబితాలో ఉన్న రైతుల భూములను తొలగించాలని, దీనికి సంబంధించి నాలుగు ఈ మేరకు జిల్లా కలెక్టర్, తహసిల్దార్లకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు అర్డర్‌తో రైతులకు ఊపిరి హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం రైతులకు సమస్యలు పరిష్కారించాలని రైతులు కోరారు.

ఉద్యమాల సూరీడు 'ఏచూరి'

- ఆయన మరణం దేశానికి తీవ్ర నష్టం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- బీమా ప్రయివేటీకరణను అడ్డుకున్న నాయకులు ఏచూరి
- రాజ్యసభ మాజీ సభ్యులు, సీనియర్ నాయకులు పి.మధు
- గొప్ప మేధావి, తాత్వికవేత్తను దేశం కోల్పోయింది
- ఎమ్మెల్సీ, ప్రముఖ కవి గోరటి వెంకన్న
- మహబూబ్‌నగర్‌లో ఏచూరి సంస్మరణ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక వర్గ ఉద్యమాల సూరీడు, మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి ఏ.రాములు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. జీవిత కాలంలో ఆయన ఎవరి కోసం తపన చెందేవారో.. ఏ సిద్ధాంతం కోసం పనిచేశారో.. ఆ ప్రజలు నేడు ఆయనను గుండెల్లో పెట్టుకున్నారని చెప్పారు. ఆయన మరణం భారత్‌తోపాటు విదేశాల్లో కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటన్నారు. ఏచూరి మనకందించిన ఆశయాల బాటలో నడవడమే నిజమైన నివాళి అన్నారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజనుల ఉద్యమాల వేదికలు ఏవైనా అన్ని విషయాలపై అనర్గళంగా ఉపన్యసించేవారని గుర్తు చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక, ఆర్థిక, సామాజిక, ఫెడరలిజం గురించి ఆయన ప్రతి ఉపన్యాసంలోనూ విడమరిచి చెప్పేవారని గుర్తు చేశారు. కమ్యూనిస్టు సిద్ధాంతం గొప్పదన్నారు. దాన్ని మించిన సిద్ధాంతం సమాజంలో లేదన్నారు. నేడు దేశంలో లౌకిక తత్వానికి ఆటంకంగా, ప్రమాదకరంగా మారిన బిజెపిని సాగనంపడమే మన ముందున్న కర్తవ్యమని చెప్పారు. ప్రజల ఆస్తి అయిన ప్రభుత్వరంగ సంస్థ ఎల్‌ఐసిని ప్రయివేటుపరం చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని, పార్లమెంటులో బిల్లును అడ్డుకున్న మేధావి ఏచూరి అని సిపిఎం సీనియర్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు గుర్తు చేశారు. పీడిత తాడిత ప్రజలు, దేశ, విదేశాల్లోని కమ్యూనిస్టు పార్టీల నేతలు, సామాజిక వేత్తలు ఏచూరి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. ఆయన మరణం దేశ అభివృద్ధికి, వామపక్ష పార్టీల ఎదుగుదలకు తీరని లోటన్నారు. జీవిత కాలంలో ఆయన అందించిన సేవలను ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. ప్రణబ్‌ముఖర్జీ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో బీమా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే ఏచూరి తన వాగ్ధాటితో వెనక్కి పంపేలా చేశారని గుర్తు చేశారు. మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ ఇవ్వకపోవడం ఎంత నష్టమో.. బీమా బిల్లు తేవడం అంతే నష్టమని చెప్పారని అన్నారు. రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం వద్దని ఆయన అనేక సార్లు నిలదీశారన్నారు. మనది బహుళ రాష్ట్రాలు కలిగిన విశాల లౌకిక భారతదేశం అని, మోడీ తలకిందులు తపస్సు చేసినా జమిలి ఎన్నికల నినాదం చెల్లుబాటు కాదని అన్నారు.

గొప్ప మేధావి : ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ఈ దేశం గొప్ప మేధావి, తాత్వికవేత్తను కోల్పోయిందని ఎమ్మెల్సీ, ప్రముఖ కవి, గాయకులు గోరటి వెంకన్న అన్నారు. విశాలమైన భారత తత్వ శాస్త్రాన్ని 10 వాక్యాలలో చెప్పారంటే ఆయన ఎంత మేధావో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. సుందరయ్య వంటి కమ్యూనిస్టు అగ్ర నేతల్లో ఆయన చేరిపోయారన్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, అభ్యుదయ వాది జనార్ధన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, సిపిఐ సీనియర్ నాయకులు కందాల రామకృష్ణ, బాలకృష్ణ, మాస్ నాయకలు రామ్‌చందర్, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేద జోలికి వస్తే ఊరుకునేది లేదు

- హైడ్రా పేరిట కూల్చివేతలు ఆపేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైడ్రా పేరిట పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చివేతలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ బొట్ల శ్రీనివాం సంస్మరణ సభకు తమ్మినేని హాజరయ్యారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం.. ప్రారంభంలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పటికీ ప్రస్తుతం తన పద్ధతి మార్చుకొని ముఖ్యంగా హైదరాబాద్ మూసీనది ప్రాంతంలో పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుందని విమర్శించారు. పెద్దగద్దలను, దోచుకునే దొంగలను, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అక్రమార్కులను, అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారులను వదిలేసి పేద, మధ్యతరగతి, చిరుద్యోగులు కష్టపడి కొనుగోలు చేసి నిర్మించుకున్న ఇండ్లను అన్యాయంగా కూల్చివేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని నష్టపోతున్న వారికి పరిహారం అందించి, ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. అలాగే, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలకు ప్రత్యామ్నాయం చూపించకుండా ఇల్లు కూల్చే కార్యక్రమానికి ప్రభుత్వం పాల్పడితే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ నెల ఎనిమిది నుంచి సిపిఎం ఆధ్వర్యంలో మూసీ పరివాహక ప్రాంతాలతో పాటు హైడ్రా కూల్చివేతలను పరిశీలించలున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్, జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి బడులకు దసరా సెలవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు బుధవారం నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్‌లోనే ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 14వ తేదీ వరకు దసరా సెలవులుంటాయి. అదేనెల 15న పాఠశాలల్లో విద్యార్థులకు తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి. ఈనెల ఆరు నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కాలేజీలకు దసరా సెలవులుంటాయి. 14న జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమవుతాయి.

పేదల పక్షపాతి బొట్ల శ్రీనివాస్

- సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టు ముద్దుబిడ్డ పేదల పక్షపాతి కామ్రేడ్ బొట్ల శ్రీనివాస్ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. జనగామ పట్టణంలోని ధర్మాకంచ సంఘరి చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన బొట్ల శ్రీనివాస్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ బొట్ల శ్రీనివాస్ చిత్రపటానికి తమ్మినేనితో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం కనకారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. శ్రీనివాస్ మృతి పార్టీకి, ప్రజలకు తీరనిలోటని అన్నారు. బొట్ల శ్రీనివాస్.. ప్రజా ఉద్యమాల సారధిగా, కార్మికనేతగా, జనగామ మున్సిపాలిటీలో ఫ్లోర్ లీడర్‌గా ప్రజల కోసం పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ముఖ్యంగా జిల్లాలో జరిగిన భూపోరాటాలు, ఇళ్ల స్థలాల పోరాటాలు, విద్యా, వైద్యం, సాగునీరు, దళిత, గిరిజన సమస్యలపై జరిగిన పోరాటాల్లో ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. ఉద్యమాల నాయకునిగా నీతి, నిజాయితీగా, నిబద్ధతగా ఉండి కార్యకర్తలను తయారు చేసి పార్టీని నిర్మించారని కొనియాడారు. జనగామ మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా రెండు పర్యాయాలు గెలిచి పట్టణ అభివృద్ధికి తమ వంతు కృషి చేశారన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు పెంచుతోందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి పాలన కొనసాగించడమే కాక, జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాసే చర్యలకు పూనుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వరదలు వచ్చి నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజల్ని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. శ్రీనివాస్ భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన ఎంచుకున్న ఆశయాలు, సిద్ధాంతాల కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివిధ పార్టీల నాయకులు, ప్రముఖ డాక్టర్లు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. శ్రీనివాస్ అందరివాడంటూ ఆయనతో తమకున్న అనుబంధాన్ని నెమర వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్, వరంగల్ జిల్లా నాయకులు సారంపల్లి వాసుదేవారెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, హన్మకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, రాష్ట్ర నాయకులు స్కైలాబ్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు, సీనియర్ వైద్యులు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సుగుణాకర్ రాజు, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు రాగల్ల ఉపేందర్, గద్దల కిషోర్ పాల్గొన్నారు.

నిర్వాసితులను ఒప్పించిన తర్వాతే కూల్చివేతలు

- మూసీ బాధితులకు న్యాయం చేస్తాం
- నది సుందరీకరణ నిర్ణయం బిఆర్ఎస్ సర్కార్‌దే : మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ నిర్వాసితులకు న్యాయం చేసిన తర్వాతే, వారిని అక్కడి నుంచి తరలిస్తామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలను ఇబ్బంది పెట్టదని స్పష్టం చేశారు. నిర్వాసితులకు డబుల్‌బెడ్ రూం ఇండ్లు, ఉపాధి, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్లల్లో చదువుకునే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2017లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ చేసిన పనులను ఆ పార్టీ నేతలు మర్చిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు. '2018లో మూసీకి సంబంధించిన ప్రాజెక్టును ఏవిధంగా చేపట్టాలనే దానిపై సమావేశం నిర్వహించారు. 15 మే 2019లో నిపుణుల కమిటీ ప్రక్షాళనపై నివేదికను తయారు చేసింది. 55 కిలోమీటర్ల మూసీ రివర్ ఇరు వైపులా సర్వే చేశారు. మూడు జిల్లాలు, 47 గ్రామాల పరిధిలో జరిగిన సర్వేలో నది సరిహద్దు, మండలాల మ్యాప్‌లను నిర్ధారించారు. ఆ క్రమంలోనే మూసీకి ఇరు వైపులా 50 మీటర్లను బఫర్ జోన్‌గా గుర్తించాలని జిఒ 7ను జారీ చేశారు. ఆ ప్రాతిపదికన 8,480 అక్రమ నిర్మాణాలను ఆనాటి వరకు అధికారులు గుర్తించారు. యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించాలని నాటి సమావేశాల్లోనే నిర్ణయించారు. మూసీ నిర్వాసితులకు పరిహారం చెల్లించి మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను అప్పటి మున్సిపల్ శాఖా మంత్రి కెటిఆర్ ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రమైన గాలి, నీరు అందించాలనే ఆలోచన చేశారని మేం కూడా అనుకున్నాం. కానీ పేపర్లకే పరిమితమై మాటలతోనే కాలం గడిపారు. మూసీ ప్రక్షాళన ప్రక్రియ చాలా క్లిష్టమైనది. సమస్యలను బిఆర్ఎస్ నేతలు ఇంకా జఠిలం చేస్తున్నారు. అందరికీ ఉపయోగపడే పనులపై వారు రాద్ధాంతం చేస్తున్నారు" అని శ్రీధర్‌బాబు విమర్శలు గుప్పించారు. నిర్వాసితులందరితో చర్చించి ముందుకెళుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వకుండానే బలవంతంగా వెళ్లగొట్టారని మండి పడ్డారు. తాము మాత్రం మూసీ బాధితులకు మరో చోట ఆవాసం కల్పించిన తర్వాతే ఇండ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. మూసీ డిపిఆర్ సిద్ధం కాకుండానే ప్రాజెక్ట్ వ్యవయంపై బిఆర్ఎస్ ఆరోపణలు చేస్తున్నదని విమర్శించారు. రాజకీయాలు మాని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు.

నేటి నుంచి డిఎస్‌సి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

- జిల్లా స్థాయిలో 5 వరకు నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లా నియామక కమిటీ (డిఎస్‌సి)కి తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. సోమవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కావాల్సిన ఉన్నా సాంకేతిక, ఇతర కారణాల వల్ల సాధ్యం కాలేదు. జిల్లా స్థాయిలో అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. దీంతో మంగళవారం నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు నాలుగు రోజులపాటు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతిరోజూ అన్ని కేటగిరీలకు సంబంధించిన అభ్యర్థులు హాజరు కావడానికి అవకాశం ఉంది. ఉపాధ్యాయ పోస్టులకు 1:3 నిష్పత్తి చొప్పున ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితాను కలెక్టర్లు, డిఇఒలకు విద్యాశాఖ పంపించిన విషయం తెలిసిందే. జిల్లా స్థాయిలో ప్రతిరోజూ ఉదయం పది గంటలకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. ఉపాధ్యాయ పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా విద్యాశాఖ అధికారులు సమాచారం అందించారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు రెండు జతల జిరాక్స్ ప్రతులను తీసుకురావాల్సి ఉంటుంది. అభ్యర్థులు అన్ని విద్యార్హతల పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు (బోనఫైడ్), కులధ్రువీకరణపత్రం, ఆధార్, డీఎస్సీ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, ఈడబ్ల్యూఎస్, పీహెచ్‌సీ సర్టిఫికెట్లు తెచ్చుకోవాలి. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానంలో డిఎస్‌సి రాతపరీక్షలను నిర్వహించింది. ఇతర వివరాల కోసం అభ్యర్థులు www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

వారం రోజులు గడువు ఇవ్వాలి

డిఎస్‌సి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు వారం రోజులపాటు గడువు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఫలితాలు విడుదల చేసిన వెంటనే ధ్రువపత్రాల పరిశీలన అంటూ అధికారులు హడావుడి చేసి అభ్యర్థులను గందరగోళానికి గురిచేస్తున్నారని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాలన్నీ అభ్యర్థులు సిద్ధం చేసుకోకుండానే హాజరు కావాలంటూ సమాచారం అందించడం సరైంది కాదని పేర్కొన్నారు. ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవడానికి రెండు, మూడు రోజులు సమయం పడుతుందని వివరించారు. అధికారులు పునరాలోచించి ధ్రువపత్రాల పరిశీలన గడువును పొడిగించాలని కోరారు.

సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో ఎస్‌బిఐ కార్డ్ జట్టు

న్యూఢిల్లీ : సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఎస్‌బిఐ కార్డ్ తెలిపింది. ఇందులో భాగంగా సూపర్ ప్రీమియం కార్డ్ 'క్రిస్‌ఫ్లైయర్ ఎస్‌బిఐ కార్డ్' ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. ఈ కార్డుతో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో టికెట్లను బుకింగ్ చేసుకోవడం ద్వారా పలు ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొంది.

ఎయిరిండియాలో ఎఐఎక్స్ కనెక్ట్ విలీనం పూర్తి

న్యూఢిల్లీ : టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థలైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఎఐఎక్స్ కనెక్ట్ (గతంలో ఎయిరేషియా ఇండియా) విలీన ప్రక్రియ పూర్తయ్యింది. విలీనానికి కావాల్సిన నియంత్రణపరమైన ఆమోదం తెలిపినట్లు మంగళవారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ప్రకటించింది. దీంతో అక్టోబర్ 1 నుంచి ఏఐఎక్స్ కనెక్ట్ కింద నమోదైన విమానాలన్నీ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పేరుతో నడవనున్నాయి.

ఎల్ఆర్ఎస్‌ను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబం హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, యూనిక్ నెంబర్‌తో డిజిటల్ ఫ్యామిలీ కార్డు అందించనున్నట్టు రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సిఎస్ శాంతి కుమారితో కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (యూడిఏ), ఎల్ఆర్ఎస్, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ధాన్యం కొనుగోళ్ళు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లోని 238 ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నామనీ, ఇప్పటికే ఆ ప్రాంతాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. పైలట్ ప్రాజెక్టులో ఎదురయ్యే మంచి చెడులను, పరిగణనలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగాఅమలు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఈ నెల మూడవ తేదీన పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. గత నాలుగేండ్ల నుంచి లక్షలాది మంది ఎల్ఆర్ఎస్ కోసం ఎదురు చూస్తున్నారనీ, ఆలస్యం చేయకుండా యుద్ధ ప్రతిపాదికన దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్లను

హైడ్రాపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

- చెరువులు, కుంటల ఆక్రమణలపై శ్వేతపత్రం ప్రకటించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైడ్రాపై ప్రజలు భయాందోళనలకు గురవుతున్నందున దాని పరిధి, పరిమితిపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం హన్మకొండ జిల్లా బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా మొదట ఎన్ కన్వెన్షన్ కూల్చివేసినప్పుడు ప్రజామోదం లభించిందని, కానీ పేదల ఇళ్లు కూల్చిన తర్వాత వారి హృదయ విధారక సన్నివేశాలు చూసిన తర్వాత అభిప్రాయం మారిందన్నారు. హైడ్రా మిస్ ఫైర్ అయినట్టు కనిపిస్తున్నదని, దాన్ని విధ్వంసానికి కాకుండా అభివృద్ధికి, వికాసానికి వినియోగించాలని సూచించారు. రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఎన్ని ఉన్నాయో, ఎక్కడ ఆక్రమణలు జరిగాయో శ్వేత పత్రం ప్రకటించాలని కోరారు. కొందరు పెద్దలు వాటిని ఆక్రమించి విల్లాలు, ఫామ్ హౌస్‌లు, కన్వెన్షన్లు నిర్మిస్తే.. మరికొన్ని చోట్ల పేదలు అన్ని అనుమతులు తీసుకుని ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని చెప్పారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్.. మూసీ ఆక్రమణలు హైడ్రా పరిధిలోకి రావని చెప్పడం సంతోషమేనని, అలాగే హైకోర్టు పేదల ఇండ్ల కూల్చివేతలపై చేసిన వ్యాఖ్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని ప్రజల్లో ఉన్న భయాందోళనలను తొలగించాలని కోరారు. పేదల ఇండ్లను జీవో 58,59 ప్రకారం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. హైడ్రాను హైదరాబాద్‌కే పరిమితం చేయాలని, జిల్లాలకు తేవొద్దని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా హైడ్రా సుడిగుండం నుంచి బయటపడి పాలనపై దృష్టి సారించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. నల్ల చట్టాలు తెచ్చి రైతులపై ప్రయోగించిన బిజెపి.. ఇప్పుడు రైతుల రుణమాఫీ చేయాలని దొంగ దీక్షలు చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గురుకుల సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలి

- సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారులు, గురుకుల సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బిసి సంక్షేమ శాఖలో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలనీ, క్షేత్ర స్థాయిలో శాఖ పనితీరు ఏ విధంగా ఉందో అధికారులు నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రజా పాలన ప్రభుత్వంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే విద్యాశాఖలో 19 వేల మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, 35 వేల మందికి బదిలీలు , 11 వేల మందికి నియామకాలు చేపట్టి ఫలితాలు విడుదల చేసుకున్నామని వెల్లడించారు. వారికి ఈ నెల 11న నియామక పత్రాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకులాల్లో కూడా నియామకాలు పూర్తయ్యాయని చెప్పారు. స్టడీ సెంటర్ల ద్వారా నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఖమ్మం బిసి స్టడీ సర్కిల్ రాష్ట్రంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్నదనీ, అక్కడ గ్రూప్-1 లో 137 మంది ప్రిలిమ్స్‌లో కోచింగ్ తీసుకుంటే 96 మంది మెయిన్స్‌కి ఎంపిక అయ్యారనీ, 574 మంది టీచర్ల కోసం శిక్షణ తీసుకుంటే 30 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఖమ్మం బిసి స్టడీ సర్కిల్ బృందాన్ని అభినందించారు. గద్వాల్ బిసి స్టడీ సర్కిల్ పనితీరు బాగాలేదని సంబంధిత అధికారులను మందలించారు. ఐఎఎస్ , ఐపిఎస్, ఎమ్మెల్యేలు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ గురుకులాలను సందర్శించాలని సూచించారు. వచ్చేనెల ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలను సందర్శించనున్నట్టు తెలిపారు. గత నెలలో పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో పాముకాటుతో చనిపోయారని



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

అలాంటి ఘటనలు రాష్ట్రంలో ఎక్కడ పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యా సంస్కరణల్లో భాగంగా అన్ని పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామని తెలిపారు. గురుకులాల్లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రయివేట్ భవనాల్లో గురుకులాలు కొనసాగుతున్నాయనీ, వాటికి స్థల పరిశీలన చేయాలని సూచించారు. అదిలాబాద్ జిల్లాలో గురుకులాల్లో యూనిఫాం అందించడంలో విఫలమైన అధికారులపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్‌లో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్, నవంబర్‌లో రాష్ట్ర స్థాయి క్రీడలు డిసెంబర్‌లో ఆర్ట్స్ అండ్ కల్చరల్ కార్నివాల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వారంలోపు కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం పై శిక్షణ పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8-9 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాటమయ్య రక్షణ కవచం పంపిణీ పూర్తి చేయాలనీ సూచించారు. సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సొసైటి కార్యదర్శి సైదులు, సిఇఒ అలోక్ కుమార్, బిసి కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇలో బిసిలకు సబ్సీడీలివ్వాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఎంఎస్ఎంఇ - 2024లో ఇతర వర్గాలకు ఇచ్చిన మాదిరిగానే బిసిలకు కల్పించాలని సిఎం రేవంత్ రెడ్డికి బిసి సంక్షేమ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎంఎస్ఎంఇ విధానంలో మార్పులు తీసుకొచ్చి బిసిల అంశాలను చేర్చేందుకు సానుకూలంగా స్పందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావుతో కలిసి బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మేధావులు , రిటైర్డ్ ఐఎఎస్‌లు, బిసి ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు , పారిశ్రామిక వేత్తలతో సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఇ జాతీయ రిటైర్డు డైరెక్టర్ ఆఫ్ జనరల్ చుక్కా కొండయ్యతో పాటు రిటైర్డు ఐఎఎస్‌లు , మేధావులు, పారిశ్రామికవేత్తలతో కలిపి కమిటీ వేయాలని నిర్ణయించారు. ఎంఎస్ఎంఇలో బిసిలకు సంబంధించిన అంశాలను చేర్చేందుకు వారి సలహాలు సూచనలు తీసుకొని అందులో చేర్చాల్సిన అంశాలపై కమిటీ నిర్ణయం తీసుకోనుంది. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్ , వీర్లపల్లి శంకర్ బిసి సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మూసీ అభివృద్ధిని అడ్డుకుంటే ప్రత్యక్ష ఉద్యమం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ అభివృద్ధిని అడ్డుకుంటే ప్రత్యక్ష ఉద్యమం చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండపై బిఆర్ఎస్ నేతలు విషం చిమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ వ్యతిరేకులతో పోరాడినట్టే...ఇప్పుడు మూసీ అభివృద్ధి నిరోధకులతో పోరాడాల్సి వస్తున్నదని చెప్పారు. మూసీ ప్రక్షాళన కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు దానికి చైర్మన్‌ను నియమించిందెవరని ప్రశ్నించారు. అందుకు విధి, విధానాలను రూపకల్పన చేసిందెవరని ప్రశ్నించారు. ఆ పేరుతో బిఆర్ఎస్ నేతలు రూ.వెయ్యి కోట్లు మింగారని విమర్శించారు. అయినా బిఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మరోవైపు తమది జనతా గ్యారేజ్ అంటూ గొప్పలు చెప్పడం కాదనీ, తెలంగాణ భవన్‌లో జనాన్ని ముంచే గ్యారేజీని నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల క్వార్టర్స్‌లో మంత్రి కోమటిరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. మూసీని ప్యూరిఫైయర్ రివర్‌గా మార్చాలని ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందని చెప్పారు. నల్లగొండ జిల్లా గ్రౌండ్ వాటర్‌లో ఫ్లోరైడ్ ఎక్కువని తెలిపారు. పదేండ్లపాటు రాష్ట్రాన్ని పాలించి రూ.లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు.

సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌కి గోదావరి జలాలు...నల్లగొండకు మురికి నీళ్లా?

మూసీ అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్ ప్రజలు గోదావరి జలాలతో సంతోషంగా ఉండాలా? నల్లగొండ ప్రజలు మూసీ మురికి నీళ్లతో చావాలా? ఇదేనా బిఆర్ఎస్ విధానం అని ప్రశ్నించారు. మూసీ నీళ్లను అమెరికా తీసుకెళ్ళి టెస్ట్ చేయించాలని డిమాండ్ చేశారు.

మూసీపై ప్రజాభిప్రాయ సేకరణకు రండి

మూసీపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్దాం..రండి అంటూ మాజీసిఎం కెసిఆర్‌కు కోమటిరెడ్డి సవాల్ విసిరారు. మూసీ దగ్గర ఉంటే రోగాలు వస్తాయని ప్రజలకు చెప్పాలనీ, ఇల్లు పోయిన వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేయాలని కోరండి తప్ప ప్రజలను రెచ్చగొట్టొదని చెప్పారు.

వయోవృద్ధుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత

- బస్సుల్లో రాయితీపై సానుకూల నిర్ణయం తీసుకుంటాం
- మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- రవీంద్రభారతిలో వయోవృద్ధుల దినోత్సవం
- హైదరాబాద్ కలెక్టర్‌కు సన్మానం

కార్యక్రమంలో వయో వృద్ధులతో మంత్రి సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వయోవృద్ధుల సంక్షేమంపై ప్రజా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణతో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వృద్ధులు, తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉండాలని, వారిని చిన్న చూపు చూడొద్దని చెప్పారు. వయోవృద్ధుల హక్కులు, సంతానానికి వారి పట్ల బాధ్యత అవగాహనకు కలెక్టరేట్‌లో సూచికలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారికి ఆర్‌టిసి బస్సుల్లో రాయితీ విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడి సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న వృద్ధాప్య పింఛన్‌ను పెంచాలని, లబ్దిదారుల సంఖ్యనూ పెంచాలని కోరారు. ఆస్తులు అంతస్తులకన్నా బంధాలు ముఖ్యమని, తల్లిదండ్రుల ఆస్తి తీసుకొని వారి పట్ల బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. అలా చేసే వారి నుంచి ఆస్తులను తిరిగి తీసుకొనే విధంగా చట్టాలు అమలు చేస్తామన్నారు. వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి దాదాపు 200 పైగా స్థిర, చర, రక్షణ, మెయింటెనెన్స్ సమస్యలను పరిష్కరించారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు హైదరాబాద్ జిల్లాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గతంలో తాను ఒక ఉద్యమకారుని తల్లి కోసం వరంగల్‌లోని వృద్ధాశ్రమానికి వెళ్లినప్పుడు అక్కడి వృద్ధుల దీన స్థితి చూసి గుండె తరుక్కుపోయిందని చెప్పారు. వయో వృద్ధులకు ఏ సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్ 14567ను సంప్రదించాలని సూచించారు. ఈ ఫిర్యాదుల నమోదు కోసం రూపొందించిన యాప్‌ను ఈ సందర్భంగా ప్రారంభించారు. వయోవృద్ధులు చట్టాలను క్రియాశీలకంగా అమలు చేస్తున్న, సమస్యల పరిష్కారంలో కృషి చేస్తున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని, పలువురు వయో వృద్ధులను మంత్రి సత్కరించారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆది, శుక్రవారం వృద్ధులకు సంబంధించిన స్థిరచర ఆస్తులు, మెయింటెనెన్స్ కేసులను పరిష్కరించినట్టు తెలిపారు. వృద్ధులకు హక్కులు, చట్టాలపై పూర్తిగా అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ, ఏడి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో డిజెలపై నిషేధం

- ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా
- హైదరాబాద్ సిపి సివి ఆనంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఊరేగింపులు, వేడుకల సందర్భంగా విపరీత శబ్ద కాలుష్యానికి దారితీస్తున్న డిజెలపై హైదరాబాద్ నగర పోలీస శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. డిజె సౌండ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని డయల్ 100కు ఫిర్యాదులు పెరగడంతో డిజెలపై నిషేధం విధించింది. ఈ మేరకు డిజెల అంశంపై ఇటీవల బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగర కొత్వాల్ సివి ఆనంద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో డిజెల నియంత్రణ అవసరాన్ని వివరిస్తూ ఆనంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లుగా డిజెలతో పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని తెలిపారు. మతపరమైన ర్యాలీలు, శోభాయాత్రల్లో డిజెలు, క్రాకర్స్ కాల్చడం నిషేధమన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 24 గంటలు నిషేధాజ్ఞలు ఉంటాయన్నారు. పరిమిత స్థాయిలో మాత్రమే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతిస్తామన్నారు. వివిధ కార్యక్రమాల నేపథ్యంలో సౌండ్ సిస్టమ్‌ను కావాలనుకునే నిర్వాహకులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి విధిగా క్లియరెన్స్ తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం నాలుగు జోన్ల పరిధిలో సౌండ్ సిస్టమ్‌ను ఉదయం 75 డెసిబెల్స్‌కు మించి వాడకూదని, రాత్రి వేళల్లో 40 డెసిబెల్స్‌కు మించి సౌండ్ పెట్టరాదని సూచించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో ఉదయం 75 డిబిలు, రాత్రి వేళల్లో 70, కమర్షియల్ ఏరియాలో ఉదయం 65, రాత్రి 55, రెసిడెన్సీ ఏరియాలో ఉదయం 55, రాత్రి 45, సైలెన్స్ జోన్‌లో ఉదయం 50డిబి, రాత్రి సమయంలో 40 డిబిలుగా ఉండాలన్నారు. మతపరమైన ర్యాలీల్లో టపాసులు కాల్చడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే నుంచి చర్యలు తీసుకుంటామన్నారు. డిజెలు, బాణాసంచా వాడితే 5 ఏండ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తామని సిపి ఉత్తర్వులో పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో డిఇ సిఐఎక్స్ విస్తరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

అతిపెద్ద ఇంటర్నెట్ ఎక్ఛేంజ్ ఆపరేటర్ డిఇ సిఐఎక్స్ ఇండియా తాజాగా వెబ్‌వర్క్స్‌తో కలిసి తమ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపింది. అందులో భాగంగా హైదరాబాద్‌లో రెండో పిఒపిని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా నగరంలోని కంటెంట్ ప్రొవైడర్స్, ఎంటర్ ప్రైజెస్‌కు డిఇ-సిఐఎక్స్ ప్రీమియం ఇంటర్నెట్ సర్వీసుల్ని అందించేందుకు వీలు కలుగుతుందని తెలిపింది. ఈ సర్వీసుల్లో పీరింగ్, డైరెక్ట్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ అజ్యూర్ పీరింగ్ సర్వీసులు ఉంటాయని ఆ కంపెనీ సిబిఒ సుధీర్ కుమార్ వెల్లడించారు.

హైదరాబాద్‌లో కోహ్లర్ స్టూడియో ఏర్పాటు

హైదరాబాద్ : భారత్‌లో తమ తొలి స్టూడియోను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు లగ్జరీ బాత్, కిచెన్ సొల్యూషన్స్ సంస్థ కోహ్లర్ తెలిపింది. విలాసవంతమైన, ఆవిష్కరణలలో కొత్త మైలురాయిని నెలకొల్పినట్లు పేర్కొంది. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో ప్రేరణ, కళను మిళితం చేసే ఆవిష్కరణల కేంద్రంగా ఉటుందని ఆ సంస్థ సిఇఒ డేవిడ్ కోహ్లర్ తెలిపారు. దేశంలోనే తమ తొలి స్టూడియోను ఇక్కడ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

వయోధికుల సమస్యలపై నిర్లక్ష్యం

- సారంపల్లి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వయోధికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎఐకెఎస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వయోధికుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోధికులకు ప్రభుత్వం ఏం చేయాలో ప్రాతినిధ్యాలతోపాటు సమస్యలను పరిష్కరించేలా నివేదికను ఇవ్వాలని సూచించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎలాంటి చర్యలు చేపడితే ఆ సమస్యలు పరిష్కారమవుతాయో వివరించాలని చెప్పారు. 80 ఏళ్ల కన్నా ఎక్కువ వయస్సున్న మల్లారెడ్డితోపాటు రాజారావు, మహతాబ్ ఎస్ బాఫ్జీ, వెంకటాచలం, మోతుకూరి నరమరి, బి కళావతి, సరస్వతి, భాస్కర్‌రావు తదితరులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి తూపురాణి సీతారాం, పి నారాయణరెడ్డి, ఎల్ అరుణ, బిజెఎం రెడ్డి, ఎన్ బ్రహ్మచారి, స్వామి, విద్యావతి, మస్తాన్‌రావు, రాధాకృష్ణ, స్వరాజ్‌కుమార్, అశోక్, వి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

పింఛన్ల పెంపుపై చర్యలు తీసుకోవాలి : ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పింఛన్ల పెంపు, ప్రతి నెల మొదటి వారంలో చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్ అధ్యక్షతన మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కమిటీల సమావేశాన్ని నిర్వహించినట్టు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 10 నెలల నుంచి 44 లక్షల మంది ఆసరా పెన్షన్ లబ్దిదారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ పెంపు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వటానికి లబ్దిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేయాలని కోరారు. సదరం క్యాంపుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారు అయిందని తెలిపారు. క్యాంపుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించటం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 21రకాల వైకల్యాల ప్రకారం వికలాంగుల జనాభా లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమం, సాధికారత కోసం ప్రత్యేక పథకాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించటం కోసం 25-27 తేదీల్లో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర నాలుగో మహాసభలు హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. మహాసభలకు 33 జిల్లాల నుంచి 450 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్‌పిఆర్‌డి హైదరాబాద్ సిటీ గౌరవాధ్యక్షులు పి శశికళ, కార్యదర్శి ఆర్ వెంకటేష్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్, కోశాధికారి జె మల్లేష్, జిల్లా నాయకులు ఆదర్శ్, మహమ్మద్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

ఎటిఎంల దొంగల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి రవి కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విలేకర్లతో మాట్లాడుతున్న డిఎస్‌పి రవికుమార్

ఎటిఎంలలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు డిఎస్‌పి రవి కుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని స్థానిక టౌన్ పోలీసు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గౌరవ్ కుమార్ యాదవ్, ఉదయభాను, విమల్ ముఠాగా ఏర్పడ్డారు. కొంతకాలంగా పట్టణంలోని ఎటిఎం కేంద్రాల వద్ద నిఘా వేసి చోరీలకు పాల్పడుతున్నారు. వారి ఎటిఎం కార్డులను ఉపయోగించి డబ్బులు డ్రా చేయడానికి పిన్ నెంబర్ ఎంటర్ చేసేవారు. డబ్బులు వచ్చే సమయంలో ఎటిఎం మిషన్ కేబుల్ వైర్‌ను తొలగిస్తారు. దాంతో వాళ్ల అకౌంట్ నుంచి డబ్బులు డెబిట్ కావు. కానీ, వారు టిటిఎం నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. అదేవిధంగా గత నెల 27న సాయంత్రం పోచంపల్లి బ్యాంకు, 28న మధ్యాహ్నం డిబిఎస్ బ్యాంకు వద్ద ఎటిఎంలలో చోరీ చేసేందుకు యత్నించారు. వీలు కాకపోవడంతో మళ్లీ మంగళవారం పోచంపల్లి బ్యాంకు వద్ద గల ఎటిఎంలో చోరీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికెళ్లారు. ఈ క్రమంలో విమల్ పరారీ కాగా, గౌరవ్ కుమార్ యాదవ్, ఉదయభానును అరెస్టు చేశారు. వారి నుంచి ఎటిఎం కార్డులు, నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో సిఐ రాజశేఖర్, ఎస్ఐ కుశలవ్ ఉన్నారు.

గార్డ్ గోపాల్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

హోంగార్డ్ గోపాల్‌ను పరామర్శించిన హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి మల్కాపూర్ చెరువులో హైడ్రా కూల్చివేతలు జరుగుతుండగా.. పొరపాటున తీవ్రంగా గాయపడి ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హోంగార్డ్ గోపాల్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రమాదం జరిగి ఇన్ని రోజులైనా ఒక్క పోలీస్ ఉన్నతాధికారి కూడా వచ్చి పరామర్శించలేదని ఆరోపించారు. హోం గార్డులు అంటే అంత చులకనా అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు చికిత్స కోసం బాధిత కుటుంబమే లక్ష రూపాయలు ఖర్చు చేశారని.. ప్రభుత్వం వైద్య ఖర్చులు భరించడం లేదన్నారు. అంతేకాకుండా నాలుగు నెలల నుంచి జీతాలు కూడా ఇవ్వడం లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారని తెలిపారు. తలకు దెబ్బ తగిలి మాట కూడా పడిపోయిందని, పూర్తిగా మాటలు రావడానికి నాలుగు నెలల పాటు స్పీచ్ థెరపీ అందించాలని డాక్టర్లుకు సూచించినట్టు చెప్పారు. ప్రమాదకరమైన డిటోనేటర్లతో పేలుళ్ళు చేసినప్పుడు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే గోపాల్ ప్రమాదానికి గురయ్యారన్నారు. ఈ ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, తప్పించుకునే ప్రయత్నం చేయకుండా గోపాల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గోపాల్‌కి పూర్తిగా నయం అయ్యేంత వరకు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కొత్తకాపు శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పేదలు చేసిన తప్పేంటి?

- పండుగపూట వారిని ఇబ్బంది పెడుతున్న రేవంత్ సర్కార్
- మీకు కష్టం వస్తే మీ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ వచ్చిండు..
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడతలేదు : కెటిఆర్
- మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటన

సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'హైదరాబాద్‌లో పేదలు చేసిన తప్పేంటి..? మీకు ఓటు వేయకపోవడమేనా..? ఇళ్ల కూల్చివేతలపై ఎంపి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడుతలేరు? సిఎం రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి కలిసి పేదలను ఆగం చేద్దామని మాట్లాడు కున్నారా?" అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ ప్రశ్నించారు. పేదలు దసరా పండగ కూడా సంతోషంగా జరుపుకోలేని దుస్థితికి తీసుకొచ్చారని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట నియోజక వర్గం గోల్నాక డివిజన్ పరిధిలోని తులసీరాంనగర్‌లో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేశ్, సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం మూసీ కూల్చివేతల బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. 'రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చి పది నెలలు అయింది.. హైదరాబాద్‌లో ఒక్క ఓటు కూడా రాలేదని మీ బతుకులను ఆగం చేస్తున్నారు.. పింఛన్లు రూ.4వేలు చేస్తా అన్నారు. ఆరు గ్యారంటీలు ఇస్తా అన్నారు.. ఏమీ ఇవ్వలేదు.. పైగా మూసీలో దోచుకో, ఢిల్లీలో పంచి పెట్టు అన్నట్టుగా సిఎం కొత్త దుకాణం తెరిచారు. ఇక్కడ 38 ఇళ్లకు రంగులు వేశారట.. ఏ ఇంటికి కష్టం వచ్చినా పక్కింటి వాళ్లు అడ్డుకోవాలి. బుల్డోజర్‌ను బొంద పెట్టాలి. ఇందిరమ్మ రాజ్యం అంటున్నారు.. ఇందిరమ్మ చెప్పారా..? సోనియమ్మ చెప్పారా.. ఇళ్లు కూల్చాలని.. ఎవరి కోసం పేదల ఇండ్లను కూలుస్తున్నారు..? గంగా నది ప్రక్షాళన కోసం 2400 కిలోమీటర్లు ఉన్న ప్రాజెక్ట్ రూ.20 వేల కోట్లతో కేంద్రం చేపట్టింది. కానీ మూసీ నదిని లక్షా 50 వేల కోట్లతో శుద్ధి చేస్తామంటూ.. దోచుకోవడానికి సిద్ధమయ్యారు.." అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీకు కష్టం వస్తే ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బిఆర్‌ఎస్ కార్పొరేటర్లు అండగా ఉంటున్నారు.. కానీ, మీ ఓట్లతో గెలిచిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్కడ ఉన్నారు" అని ప్రశ్నించారు. గల్లీలో తిట్టుకుంటూ ఢిల్లీలో మాత్రం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి ఒక్కటై పేదల ఇళ్లను కూల్చడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత సొమ్మును ఢిల్లీకి తాకట్టు పెట్టడానికి ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్ కుమార్‌గౌడ్, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, పద్మా వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మావతి దుర్గ ప్రసాద్‌రెడ్డి, బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, చంద్రమోహన్, ఎర్ర భీష్మ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్ కారును అడ్డుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మూసీ కూల్చివేతలపై బాధితులను పరామర్శించడానికి వచ్చిన మాజీ మంత్రి కెటిఆర్‌కు విద్యానగర్ హిందూ మహావిద్యాలయ చౌరస్తా వద్ద నిరసన సెగ తగిలింది. మంత్రి కొండా సురేఖకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు కెటిఆర్ కారును అడ్డుకున్నారు. కెటిఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అడ్డు తప్పు కోవాలని పోలీసులు ఎంత చెప్పినా వినకపోవడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కొందరు కెటిఆర్ వాహనంపైకి ఎక్కారు. దాంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి కేటీఆర్ కాన్వాయ్‌ను ముందుకు పంపించారు. ఇదిలా ఉండగా బాధితులతో సమావేశం అనంతరం కెటిఆర్ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నివాసానికి వెళ్లారు.

దంపతుల ఆత్మహత్య

- సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ.16 లక్షలు తీసుకున్న బ్రోకర్
- భద్రాద్రి జిల్లాలో విషాదం

పార్వతీ, రత్నకుమార్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగం ఇప్పిస్తానంటే రూ.16 లక్షలు డబ్బులు చెల్లించి.. చివరకు మోసపోయామని గ్రహించిన భార్యభర్త పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం సాయిరాం తండాలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిరాం తండాకు చెందిన హలవత్ రత్నకుమార్ (28), పార్వతీ (26) దంపతులు కొంతకాలంగా కొత్తగూడెంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తూ చుంచుపల్లిలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పరిచయమైన ఒక వ్యక్తి సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో అతని మాటలను నమ్మిన ఆ దంపతులు ఏడాది కిందట రూ.16 లక్షల నగదు చెల్లించారు. ఏడాదిగా వెంటపడినా ఉద్యోగం మాత్రం రాలేదు. ఇంతలో డబ్బు తీసుకున్న వ్యక్తి చనిపోయినట్టు తెలిసింది. అతని చేతిలో మోసపోయామని గ్రహించిన దంపతులు సోమవారం మధ్యాహ్నం పురుగుమందు తాగారు. అపస్మారక స్థితిలో ఉండగా బంధువులు గమనించి కొత్తగూడెంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంకు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి దంపతులు మృతి చెందారు. మంగళవారం ఉదయం వారి మృతదేహాలను స్వగ్రామానికి తరలించి పోస్టుమార్టం అనంతరం అంత్య క్రియలు నిర్వహించారు. ఉద్యోగం కోసం వారు ఎవరికి డబ్బులు చెల్లించినది ఇంకా తెలియ రాలేదు. పూర్తి వివరాలు పోలీస్ విచారణలో తేలాల్సి ఉంది.

కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ దాడులు

- మాజీ విసి అక్రమ ఉద్యోగోన్నతిపై ఆరా
- ఫేక్ ప్రాజెక్టులపై నిలదీత
- అందుబాటులో లేని రిజిస్ట్రార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాకతీయ యూనివర్సిటీ మాజీ విసి తాటికొండ రమేష్ అక్రమాలపై విజిలెన్స్ విచారణకు సిద్ధమైంది. అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (ఎకెయుటి) బాధ్యులు మాజీ విసిపై ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు వేరువేరుగా ఇచ్చిన ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఎస్‌పి బాలు కోటి, సిఐ రాకేష్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో మంగళవారం విచారణ జరుపుతున్నారు. ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నరసింహా చారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారిని రిజిస్ట్రార్ ఛాంబర్‌కు పిలిపించుకొని అన్ని ఫైల్స్ గురించి ఆరా తీస్తున్నట్టు సమాచారం. అలాగే, రమేష్ వీసీగా ఉన్నప్పుడు ఇచ్చిన సీనియర్ ప్రొఫెసర్ ఉద్యోగోన్నతిపై ఆరా తీసుకున్నట్టు తెలుస్తోంది. కాగా, గతంలో నాలుగు సార్లు విజిలెన్స్ అధికారులు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు నోటీసులు ఇచ్చినా వాటికి సంబంధించిన ఫైల్స్‌ను ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించినట్టు సమాచారం. సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్‌కు సంబంధించిన సెలెక్షన్ కమిటీ ప్రొసీడింగ్స్, ఇసి మినిట్స్ గురించి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. ఫార్మసీ, ఇంజనీరింగ్‌లో జరిగిన పిహెచ్‌డి అక్రమాలపై కూడా డీన్‌లను పిలిపించి ప్రశ్నించే అవకాశం ఉన్నట్టు సమాచారం. పాత సర్వీసును అక్రమంగా కలుపుకొని రిజిస్ట్రార్ ఆర్డర్ ద్వారా పదోన్నతులు పొందుతున్న వారితోపాటు పాత పెన్షన్ విధానంలోకి మారిన వారి గురించి ఆరా తీస్తున్నట్టు సమాచారం.

317 జిఒ బాధితులకు న్యాయం చేయండి

- సిఎం రేవంత్‌రెడ్డికి చాడ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 317 జిఒ ద్వారా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సత్వరమే న్యాయం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. గత ప్రభుత్వం 317 జిఒను తెచ్చిందని తెలిపారు. దీంతో సొంత స్థానిక జిల్లాలు వదిలి సుదూర ప్రాంతాలకు స్థానికేతర జిల్లాలకు బదిలీ అయ్యారని పేర్కొన్నారు. నిరసన చేపట్టినా, విజ్ఞప్తులు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిందని వివరించారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఆ జీవోను సవరించి న్యాయం చేయాలని కోరారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి
- ప్రాణాలు తీసిన అతివేగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుమారుడి చదువులో భాగంగా కోర్సు పూర్తవడంతో సన్మాన కార్యక్రమానికి వెళ్లి సంతోషంగా తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని కబలించింది. కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడటంతో ఐదుగురు ప్రాణం కోల్పోయారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న సయ్యద్ మోయిజొద్దీన్ (67) విద్యుత్ శాఖలో ఫోర్‌మెన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య ఆయేషా, ముగ్గురు కుమారులు మహ్మద్ ఫరీదొద్దీన్ (14), మహ్మద్ ఉస్మానొద్దీన్ (8), మహ్మద్ సాద్, కుమార్తె ఇఖ్రా ఉన్నారు. పెద్ద కుమారుడు ఫరీదొద్దీన్ భైంసాలోని దారులుమ్‌లో ఖురాన్ హాఫీజ్ కోర్సు సందర్భంగా భైంసాలో సన్మాన కార్యక్రమం జరిగింది. అందుకోసం ఆదిలాబాద్ నుంచి కారులో ఏడుగురు కుటుంబీకులు సోమవారం మధ్యాహ్నం బయల్దేరి వెళ్లారు. భైంసాలో కార్యక్రమాన్ని ముగించుకున్న అనంతరం రాత్రి 9.15 గంటలకు తిరుగు ప్రయాణం అయ్యారు. ఏడుగురితో పాటు ఫరీదొద్దీన్ కూడా ఉన్నాడు. గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి వద్ద రాత్రి 11 గంటల సమయంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడి నుజ్జు నుజ్జయింది. ఆ సమయంలో కారును సయ్యద్ మోయిజొద్దీన్ నడుపుతున్నారు. మోయిజొద్దీన్‌తోపాటు కుమారులు మహ్మద్ ఫరీదొద్దీన్, మహ్మద్ ఉస్మానొద్దీన్, అతని అల్లుడు ఖాజా మోయినొద్దీన్ (43) ఘటన స్థలంలోనే ప్రాణం కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మోయినొద్దీన్ మనుమడు మహ్మద్ అలీ(5)ని 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడు. మోయిజొద్దీన్ భార్య ఆయేషా, మరో కుమారుడు సాద్, కుమార్తె ఇఖ్రా గాయాలతో బయటపడ్డారు. ఖాజా మోయినొద్దీన్ విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఒకే కుటుంబంలో ఐదుగురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడపటం వల్లే ప్రమాదం జరిగినట్టు డిఎస్‌పి నాగేందర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి సెర్చ్ కమిటీల భేటీ

- కొత్త విసిల నియామకంపై కసరత్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల ఉపకులపతుల (విసి) నియామకం ప్రక్రియకు సంబంధించి గురువారం నుంచి సెర్చ్ కమిటీల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. శుక్ర, శనివారాల్లోనూ ఈ భేటీలు జరుగుతాయని విశ్వసనీయంగా తెలిసింది. కొన్ని విశ్వవిద్యాలయాలకు సంబంధించిన సెర్చ్ కమిటీల సభ్యులు విదేశాల్లో ఉన్నారని సమాచారం. అందులో కొందరు వర్చువల్‌గా పాల్గొనే అవకాశం ఉంది. మరికొన్ని వర్సిటీల సెర్చ్ కమిటీ సభ్యులు నేరుగా పాల్గొనేందుకు వీలుకాదని సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. దీంతో సెర్చ్ కమిటీల భేటీలు ఆలస్యమయ్యే అవకాశమున్నది. జెఎన్‌ఎఫ్‌ఎయుతో పాటు మరో విశ్వవిద్యాలయం సెర్చ్ కమిటీల భేటీ తేదీల్లో మార్పు ఉండనుంది. వాటి భేటీ ఖరారయ్యాక రాష్ట్రంలో పది విశ్వవిద్యాలయాల విసిలకు సంబంధించి ముగ్గురు పేర్ల ప్రతిపాదనలతో రాష్ట్ర ప్రభుత్వానికి సెర్చ్ కమిటీలు సిఫారసు చేస్తాయి. వాటిని న్యాయ శాఖ పరిశీలించిన తర్వాత గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపిస్తుంది. ముగ్గురు పేర్లలో ఒకరిని గవర్నర్ ఆమోదించిన తర్వాత వీసీల నియామకానికి ఉత్తర్వులు వెలువడతాయి. అయితే ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కొంత సమయం పట్టే అవకాశమున్నది.